
# బాధ్యత

ఆంధ్రభూమి వీక్లీ.. 6 ఫిబ్రవరి, 2003




"హలో రఘూ! కమాన్... ఇంత ఆలస్యమయిందేం?" రఘురాంతో అన్నాడు రమేష్.

"గెస్ట్స్ వచ్చారు ఇంటికి! సారీ..!"

"నెవర్‌మైండ్! రామ్మా... శారదా! లోపల వసుధ నీకోసమే ఎదురుచూస్తోంది... వెళ్లు!" రఘురాం భార్య శారదతో అన్నాడు రమేష్.

శారద లోపలికి వెళ్లాక-

రఘురాం రమేష్ ప్రక్కనే నిలబడి గెస్ట్స్‌ని రిసీవ్ చేసుకోసాగాడు.

రమేష్ కూతురు దివ్య పెళ్ళి సందర్భంగా ఏర్పాటుచేసిన రిసెప్షన్ అది!

వియ్యంకుల కోరిక మేరకు పెళ్ళి తిరుమలలో జరిపించాడు రమేష్. రిసెప్షన్ మాత్రం తన ఊరిలోనే ఏర్పాటుచేసి బంధుమిత్రులందరినీ ఆహ్వానించాడు.

"రమేష్..! మా షాలిని, దినేష్ వచ్చారా?" రఘురాం అడిగాడు.

"ఆహాఁ..! మీ హీరో హీరోహోండాపై తన ముద్దులచెల్లెల్ని వెనుక కూర్చోబెట్టుకొని వచ్చాడు. ఐ థింక్... హి ఈజ్ ఎంజాయింగ్ విత్ హిజ్ ఫ్రెండ్స్!" అన్నాడు రమేష్.

రఘురాం అక్కడ్నుంచి కదిలి మెల్లగా నడవసాగాడు.

దూరంగా ఫ్రెండ్స్‌తో దినేష్ కనిపించడంతో అటువైపు అడుగులు వేశాడు.

"నమస్తే అంకుల్..!" దినేష్ స్నేహితులందరూ రఘురాంతో చేతులు కలిపారు.

"బాగున్నారా... బాగా చదువుకుంటున్నారా?"

అందరూ తలూపారు.

"హేడ్ యువర్ డిన్నర్..?"

"నో అంకుల్! వుయ్ ఆర్ వెయిటింగ్ ఫర్ మదన్!"

"ఓ.కె... ఎంజాయ్!" అంటూ అక్కడ్నుంచి కదిలాడు.

వెళ్తున్న రఘురాంను చూస్తూ-

"దినేష్! మీ నాన్నగారు చాలా యంగ్‌గా కనిపిస్తున్నారు. మీ అన్న అంటే నమ్మేస్తారు ఎవరైనా!" అన్నాడు దినేష్ ఫ్రెండ్ చైతన్య.

"అవున్రా..! వార్ధక్యం శరీరానికి రావాలేగానీ, మనసుకి రాకూడదు అంటారు ఆయన!" దినేష్ చెప్పాడు.

"చాలా కరెక్టుగా చెప్పారు!" మెచ్చుకున్నాడు మరో ఫ్రెండు.

రఘురాం తన కొడుకు ఫ్రెండ్స్‌ని పలకరించాక ఆడపిల్లలున్న దిశగా నడిచాడు.

షాలిని తన స్నేహితురాళ్ళతో మాట్లాడుతోంది.

నవ్వుతూ, ఉల్లాసంగా కనిపిస్తున్న కూతుర్ని చూసి మనసులోనే సంతోషపడ్డాడు. షాలిని అందంగా ఉండటమే కాదు, చాలా చురుకైన పిల్ల కూడా! ఎలాంటివారితోనైనా తొందరగా కలిసిపోతుంది.

"నమస్తే అంకుల్..!" అందరూ రఘురాంని విష్ చేశారు.

వాళ్ళంతా అతనికి ఇదివరకే పరిచయం ఉన్నవారు.

కూతురి భుజంపై చెయ్యి వేసి, "భోంచేశావా..?" అని అడిగాడు.

"ఇంకా లేదు డాడీ! ముందు అంకుల్ ఆఫీస్ స్టాఫ్ భోజనాలు అవనీండి. మాకేం తొందర? అవునూఁ... దీనూ కనబడ్డాడా మీకు?"

"ఆ చివర ఉన్నాడు. ఎందుకు?"

"మా ఫ్రెండ్సంతా వాడిచేత ఓ పాట పాడించాలని అనుకుంటున్నారు!"

"వెరీగుడ్... నేను వెళ్లి వాణ్ణి పంపిస్తాను!"

"మీరు వెళ్లకండి! కాసేపాగి నేనే వెళ్లి పిలుచుకొస్తాను!"

"ఫరవాలేదమ్మా... నాకు ఏం పని ఉంది ఇక్కడ? ఓ.కె. ఉంటానమ్మా! అందరూ భోంచేసి వెళ్లండి!"

"అలాగే అంకుల్! దినేష్‌ని పంపడం మరచిపోకండి'!' అమ్మాయిలందరూ ఒకేసారి అన్నారు.

కొడుకుతో విషయం చెప్పి రమేష్ కోసం కదిలాడు. కొడుకుతో పాటు వెళ్లి అతడి పాట వినాలని ఉన్నా- తనుంటే వాళ్ళ స్వాతంత్ర్యానికి కొద్దో, గొప్పో భంగం కలుగుతుందని ఆ ఆలోచన మానుకున్నాడు.

కొద్దిసేపటి తర్వాత మధు గుర్తొచ్చాడు రఘురాంకి.

"రమేష్! మీవాడు కనబడడేం..?"

"అదే... నాకూ అర్థంకావడం లేదు. సాయంత్రందాకా నాతోనే ఉన్నాడు. ఊరినుంచి తన ఫ్రెండ్స్ వచ్చేసరికి మాయమయిపోయాడు!" బాధగా అన్నాడు రమేష్.

"వచ్చేస్తాడులే... నీవు కంగారుపడకు!"

"రఘూ... ఓ చిన్న సహాయం చేస్తావా..?" అభ్యర్ధనగా అన్నాడు రమేష్.

"చెప్పరా... ఏం కావాలి?"

"మధు తన ఫ్రెండ్స్‌కోసం మయూర లాడ్జిలో రూమ్స్ బుక్ చేశాడు. వాడు అక్కడే ఉండిపోయాడేమో! నీవు వెళ్లి నేను రమ్మన్నానని చెప్పి పిలుచుకురాగలవా?"

"అంతేకదా... తప్పకుండా వెళ్తాను!"

బయలుదేరబోతున్న రఘురాంని వెనక్కి పిలిచి ఏదో చెప్పబోయి, సంశయిస్తున్నట్లు ఆగిపోయాడు.

"మధు ఎక్కువగా త్రాగకుండా నేను చూసుకుంటానులే! నీవు నిశ్చింతగా ఉండు!"

రమేష్ కళ్ళలో నీరు నిండుకున్నాయి. అతన్ని అలా చూసిన రఘురాంకి మనసులో ఎంతో బాధ కలిగింది.

"ఛ... ఛ..! ఇంట్లో శుభకార్యం జరిగి అందరూ సంతోషంగా ఉన్నప్పుడు అలా కళ్ళనీళ్లు పెట్టుకోకూడదు. కంట్రోల్ యువర్ సెల్ఫ్! ఎవరైనా చూస్తే బాగుండదు. నేను వెళ్ళి ఇప్పుడే మధుని పిలుచుకొని వస్తాను!"

లాడ్జిలో మధుని చూడగానే రమేష్ ఊహించింది నిజమేనని అర్థమైంది రఘురాంకి.

అతన్ని చూసి మధు తడబడ్డాడు.

"అంకుల్..! మీరేమిటి... ఇలా వచ్చారు?" కంగారుగా అతన్ని సమీపించి అన్నాడు.

"మీ చెల్లెలి పెళ్ళి రిసెప్షన్‌కి నిన్ను పిలవడానికి వచ్చాను!" రూము మధ్యలో కనిపిస్తున్న ఖాళీబాటిల్స్‌ని చూస్తూ అన్నాడు.

"నేనూ బయలుదేరదామనే అనుకుంటున్నాను. ఫ్రెండ్స్ బలవంతం చేస్తే..."

"త్రాగుతూ కూర్చున్నావు. చాలాబాగుంది. సొంత చెల్లెలి పెళ్ళి రిసెప్షనుకి రాకుండా త్రాగుతూ కూర్చునేవాణ్ణి నిన్నే చూశాను. మీ నాన్న బాధని చూడలేకపోతున్నానయ్యా..! ఫంక్షన్‌రోజు కళ్ళనీళ్లు పెట్టుకుంటున్నాడు నీ ప్రవర్తన వల్ల!"

"సారీ అంకుల్! పదండి... వెళదాం!"

ఫ్రెండ్స్‌తో చెప్పి రఘురాంతో బయలుదేరాడు.

ఫంక్షన్ హాలు చేరగానే కారు దిగి, నేరుగా వెళ్లి తండ్రి పక్కన నిలబడ్డాడు. అతన్ని చూసిన రమేష్ మనసు కోపంతో, బాధతో రగిలిపోసాగింది.

"ఈ ఒక్కరోజు కాస్త స్థిరంగా ఫంక్షన్‌లో ఉండలేవా..? అడిగినవాళ్ళకు జవాబులు చెప్పలేక ఛస్తున్నాను. ఎప్పుడు తెలుసుకుంటావురా... బాధ్యతలు?"

విసురుగా అక్కడ్నుంచి కదిలి అప్పుడే బయలుదేరబోతున్న ఖాళీ ఆటోలో ఎక్కి వెళ్లిపోయాడు మధు.

వాళ్ళిద్దరి మధ్య ఏం జరిగిందో అర్థం కాక నిశ్చేష్టుడై నిలబడిపోయాడు రఘురాం.

• • •

కుమార్తెను చెన్నైలో అత్తగారింట్లో దిగబెట్టి, తిరిగి హైదరాబాదు రైలెక్కారు రమేష్ దంపతులు.

ఒక బాధ్యత తీరిందన్న తృప్తి, 'బిడ్డ దూరంగా ఉంటుందే...' అన్న బాధ వాళ్ళ మనసుల్లో ఉంది.

"మధు అమ్మాయి పెళ్ళిలో ఎంతో చక్కగా పనులు చేశాడండీ! మనం అనవసరంగా భయపడ్డాం!" అంది వసుధ భర్తతో.

ఇంకా ట్రైను బయల్దేరడానికి చాలా సమయం ఉండటంతో కంపార్ట్‌మెంట్ ఖాళీగానే ఉంది. కూతురూ, అల్లుడూ హనీమూన్‌కి ఊటీకి మధ్యాహ్నమే వెళ్లిపోయారు. వియ్యంకులు రైల్వేస్టేషనుకి వస్తామనే అన్నారు కానీ, వీళ్ళే వద్దని వారించారు.

"హుఁ..! నీకంతే తెలుసు! పెళ్ళి తిరుమలలో కాబట్టి అక్కడ బుద్ధిగానే ఉన్నాడు. రిసెప్షనురోజు రాత్రి పదిదాకా వాడు ఫ్రెండ్స్‌తో తాగుతూనే ఉన్నాడు. మధ్యలో రఘు వెళ్లి పిలుచుకుని వచ్చాడు. నేను వాడి వాలకం చూసి కడుపు మండి తిట్టాను. నన్నో పురుగును చూసినట్లు చూసి మళ్లీ ఫ్రెండ్స్ దగ్గరికే వెళ్లిపోయాడు. అందరూ 'నీ కొడుకెక్కడ?' అని అడగడమే! నాకు పదిమంచి ముందూ గౌరవంగా బ్రతికే అదృష్టం లేదు!" బాధగా అన్నాడు.

మనస్సు చివుక్కుమంది వసుధకి. భర్త అంత బేలగా మాట్లాడటం ఎప్పుడూ చూడలేదు ఆమె.

"మీరు బాధపడకండి. వాడు తప్పకుండా మారతాడు. నాకు భగవంతుడి పైన నమ్మకం ఉంది!" భర్తని ఓదారుస్తూ అంది.

"చూద్దాం. పాపం రఘుకు కూడా శ్రమ ఇచ్చాను మధు విషయంలో..!"

"ఆయన ఎవరికి ఏ అవసరం వచ్చినా ముందుంటారు. శారదా అంతే..! ఇదివరకు పరిచయం లేనివారు కూడా ఆమె నవ్వుతూ మాట్లాడుతూంటే చాలా ఏళ్ల పరిచయం ఉన్నట్లు ఫీలవుతారు!"

"మన రఘురాం పిల్లల విషయంలో చాలా అదృష్టవంతుడు. వాళ్ళు చక్కగా చదవడమే కాదు, మంచి క్రమశిక్షణ, పెద్దలంటే గౌరవం ఉన్నవారు. ముఖ్యంగా తల్లిదండ్రుల మాట జవదాటరు!"

"దాన్ని అదృష్టం అనకండి! అదృష్టం కూడా ఉండాలి కాని, అది కొంత శాతమే కారణం! రఘురాం అన్నయ్య పిల్లల్ని ఎలా పెంచాడో నాకు తెలుసు. ఆఫీసు వదిల్తే ఇంటికెళ్లి పిల్లలతో ఆడుకునేవాడు. చదివించేవాడు. ఎన్నో ప్రదేశాలూ, ఊర్లూ చూపించాడు. మంచిగా ఉండడం,

మంచి చెయ్యడం తన ప్రవర్తనతోనే చూపించాడు. వారిలో క్రమశిక్షణ పెంపొందించాడు. మీరేం చేశారు..? ప్రతిరోజూ ఆఫీసులో అర్ధరాత్రి వరకూ క్యారమ్స్, పేకాట, ఫ్రెండ్స్‌తో తిరగడాలు చేశారు. నిజానికి ఫ్రెండ్స్‌తో తిరగాలని... గేమ్స్ ఆడాలని ఏ మగవాడికి ఉండదు? కాని, రఘురాం అన్నయ్య తన బాధ్యతలు తెలుసుకుని కొన్ని త్యాగాలు చేశాడు. ఇప్పుడు ఆ ఫలం అనుభవిస్తున్నాడు. విత్తనమే నాటకుండా ఫలం రావాలంటే ఎలా వస్తుంది?"

రమేష్ ముఖం చూశాక 'తను అలా మాట్లాడి ఉండకూడదు' అనుకుంది వసుధ. అసలే మధు ప్రవర్తనతో కాస్త చెదిరిన మనసుతో ఉన్నాడు.

"మిమ్మల్ని హర్ట్ చేయాలని కాదు నా ఉద్దేశం! అన్నయ్య కొన్నిఏళ్లు అలా తనకు తానే కొన్ని నిబంధనలు విధించుకుని, ఓపికతో పద్ధతి ప్రకారం కష్టపడ్డాడు. ఆ కష్టాన్ని మీరు అదృష్టం అంటే నాకు బాధ కలిగింది!" అంది మళ్లీ తనే.

"నీవన్నది నిజమే! పిల్లల జీవితాల్లో అతిముఖ్యమైన సమయంలో నేను నిర్లక్ష్యం చేశాను. ఆనాడు నా బాధ్యత సక్రమంగా నిర్వర్తించి ఉంటే ఇప్పుడు నిశ్చింతగా ఉండేవాడిని. నా బిడ్డ బాగుండడమే కాదు.., సమాజానికి ఓ మంచిపౌరుణ్ణి ఇచ్చానన్న తృప్తి కూడా లభించి ఉండేది!"

• • •

హైదరాబాద్ చేరగానే రఘురాంని కలిసి కొడుకు విషయం మాట్లాడాడు.

"గతంలో నేను కొన్ని పొరపాట్లు చేసినమాట నిజం! ఇప్పుడు మధు ప్రవర్తనలో మార్పుకోసం ఎలాంటి త్యాగాలకైనా నేను సిద్ధంగా ఉన్నాను. చెప్పు... నన్నేం చేయమంటావు?"

"వసుధతో కలిసి ఊటీకెళ్లి ఓ పదిరోజులు ఎంజాయ్ చేసి రా..!" నవ్వుతూ అన్నాడు రఘురాం.

"నేను సీరియస్‌గా మాట్లాడుతూంటే నీవు జోకులు వేస్తున్నావు!" నిష్ఠూరంగా అన్నాడు రమేష్.

"నేనూ సీరియస్‌గానే మాట్లాడుతున్నాను. మీరు ఊర్లోలేని పదిరోజులూ మధు మా ఇంట్లో ఉంటాడు. మేమంతా కలిసి అతనిలో మార్పుకోసం ప్రయత్నిస్తాం. మధు ఆల్కహాల్‌కి బానిస కాదు. కాకపోతే... 'సెలబ్రేషన్' అంటే ఫ్రెండ్స్‌తో త్రాగడమే అనే భ్రమలో ఉన్నాడు. అంతెందుకు– మా ఆఫీసులో కూడా కొంతమంది ఉన్నారు. ఏదైనా పెళ్ళి, ఫంక్షన్ అంటే చాలు– త్రాగడం, తర్వాత గుట్టుగా భోజనం చేసి వచ్చేయడం! పిక్నిక్‌కి వెళ్లినా, పోటీలకు వెళ్లినా త్రాగడం తప్పనిసరి! ఆ తర్వాత వారి ఓవర్‌యాక్షన్ చూడలేక మాకు చికాకు వస్తూంటుంది. అందరూ కలిసి హాయిగా అంత్యాక్షరి ఆడుకోవచ్చని వారికి తెలియదు. పులిహోర, దద్ధోజనం అప్పులతో కలిసి తింటే ఎంత రుచిగా ఉంటుందో వాళ్ళకి తెలియదు. పిల్లలు తమకి తెలిసిన స్కిల్స్ ఎగ్జిబిట్ చేస్తూంటే ఎంత ముద్దొస్తారో వారికి తెలియదు. వారికి తెలిసిందల్లా నలుగురు కలిస్తే త్రాగాలి... అంతే!"

"అయితే... మధు మారతాడంటావా?"

– ఆశగా అడిగాడు రమేష్.

"నీకా అనుమానమే అక్కర్లేదు."

"వాడి ఆఫీసు టైమింగ్స్ డిఫరెంట్‌గా ఉంటాయి. రాత్రిళ్లు లేట్‌గా వస్తూంటాడు. మీకు ఇబ్బంది కదా..?!"

"అవన్నీ నేను చూసుకుంటాను! నీవు హాయిగా కొద్దిరోజులు గడిపిరా!"

"అలాగే... థాంక్యూ!" రఘురాం చేయి అందుకుంటూ అన్నాడు రమేష్.

ఊటీలో పదిరోజులు గడిపి తిరిగొచ్చిన రమేష్ దంపతులకి– రైల్వేస్టేషన్‌కి మధు రావడం ఆశ్చర్యపరిచింది. తల్లిదండ్రుల్ని రిసీవ్ చేసుకుని, ఇల్లు చేరాక బయటకి వెళ్లి టిఫిన్ తెచ్చాడు మధు.

స్నానం చేశాక తన గదిలోని ఫోన్‌నుంచి రఘురాంతో మాట్లాడాడు రమేష్.

"ఎప్పుడొచ్చావ్ ఊరినుంచి? ఎలా గడిచింది మీ హనీమూన్?"

"చాలా హాయిగా ఉంది. నీలాంటి స్నేహితుడు అండగా ఉంటే ఎంత నిశ్చింతగా ఉంటుందో అనుభవం వల్ల ఈరోజు తెలిసింది. మధు ఎలా ఉన్నాడు మీతో..?"

"చాలా బాగున్నాడు. అతనిలోని మరోవ్యక్తిని చూశాను నేను. హి ఈజ్ ఇంటెలిజెంట్ అండ్ అండర్‌స్టాండింగ్!"

"మళ్లీ తాగాడా?"

"లేదు. గత ఆదివారం దినేష్ పుట్టినరోజని చెప్పి సెలబ్రేట్ చేశాం. నిజానికి దినేష్ పుట్టింది అక్టోబర్‌లో! మధు కోసమే అలా నాటకం ఆడాం. పుట్టినరోజు ఎలా సెలబ్రేట్ చేసుకోవచ్చో అతనికి తెలిసింది. ఇక పాత సెలబ్రేషన్ పద్ధతుల జోలికి పోడనే అనుకుంటాను!"

"అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలవు?"

"మధు ఆల్కహాల్ కంటే అద్భుతమైన వస్తువును మా ఇంట్లో కనుక్కొన్నాడు కనుక..."

"ఏమిటది?" ఆశ్చర్యంగా అడిగాడు రమేష్.

"నా కూతురు షాలిని..!"

"ఏమిట్రా... నీవంటున్నది?"

"అవును. షాలినితో స్నేహం మధులో మార్పు తీసుకొచ్చింది. ఆమె మధుపై కన్సర్న్ చూపింది. అతనిలోని మంచిని మెచ్చుకుంది. తన ప్రవర్తనతో ప్రభావితుణ్ణి చేసింది. స్వతహాగా మధు చెడ్డవాడు కాదు కనుక త్వరగా మారాడు!"

"మరి, రేపు షాలినితో 'ప్రేమ' అంటూ మొదలుపెడతాడేమో ఆలోచించావా..?"

"ఆలోచించాను. వాళ్ళిద్దరిపై నాకు నమ్మకం ఉంది. ఒకవేళ అన్నా అభ్యంతరం చెప్పడానికి నాకు ఏ కారణం కన్పించడం లేదు. వాళ్ళిద్దరూ నా బిడ్డలే! నీవేమంటావ్?"

"నాకేం అభ్యంతరం లేదు. కాకపోతే కట్నంలో డిస్కౌంట్ మాత్రం ఇవ్వలేను!"

"ఎంత కావాలి... కట్నం నీకు?"

"డబ్బు రూపేణా వద్దు!"

"మరింకేం కావాలి?"

"కలకాలం... నీ స్నేహం!"